క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్‌కు చెందిన రాజమోని చిన్న రాములు (61) సోమవారం రాత్రి మృతిచెందాడు. మంగళవారం సర్పంచ్ కాడమోని శ్రీశైలం, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు మల్లేశ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వారికి సర్పంచ్ రూ.5000 ప్రభాకర్‌రెడ్డి రూ.3000, జెడ్పీటీసీ రూ.3000, మల్లేశ్ రూ.2000 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, రామస్వామి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కుమ్మరి శంకర్, ఆంజనేయులు, పీఈటీ మల్లేశ్, జంగయ్య, ఆంజనేయులు, కృష్ణ, తిరుపతి, వెంకటయ్య, శ్రీను, శంకర్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

రూ.10వేలు అందజేత..

కడ్తాల్: మండల పరిధిలోని వాస్‌దేవ్‌పూర్ గ్రామ నివాసి హర్యానాయక్‌కు చెందిన 11 మేకలను ఈనెల 18వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు అపహరించారు. బాధిత హర్యానాయక్‌ది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామ ఇన్‌చార్జి సర్పంచ్ కేతావత్ రవికుమార్ మంగళవారం వాస్‌దేవ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాణి, పాండునాయక్, జైపాల్ నాయక్, లక్ష్మన్, రామకృష్ణ, సిద్దూ, బీక్యా, రవి, కృష్ణ, రవి, రాజు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సునీల్

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ సహకారంతో వార్డులో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కమ్మగూడ కౌన్సిలర్ కాకుమాను సునీల్ అన్నారు. డివిజన్ పరిదిలో రూ.10 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. కాలనీ వాసులు ప్రభాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గోపాల్ రావు, మరియన్న తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్‌కు షోకాజ్ నోటీసు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి షోకాజ్ నోటీసు అందజేశారు. అధికార పార్టీలో ఉండి పార్టీని సంప్రదించకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్‌పై అవిశ్వాసం కోసం సంతకాలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈనెల 24వ తేదీ వరకు సమాధానం ఇవ్వాలని కోరారు. అయితే ఈ విషయమై రెండు రోజుల క్రితమే పూర్తి సమాచారంతో వివరణ ఇచ్చినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయండి



వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రామ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా మండల కేంద్రంలో ఒక్క ఆధార్ కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు, స్థానికులు మహేశ్వరం, హైదరాబాద్, వెల్దండ తదితర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తోందని వివరించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో కోరారు.

సర్పంచ్‌లకు సన్మానం



అబ్దుల్లాపూర్‌మెట్: సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెలాఖరుతో ముగుస్తున్న సందర్భంగా మండలానికి చెందిన సర్పంచ్‌లను మంగళవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ బుర్ర రేఖామహేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సత్కరించారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే ప్రధాన పాత్ర అన్నారు. గ్రామ ప్రథమ పౌరులుగా సేవలందించారన్నారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, ఎంపీడీఓ మమతాబాయి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై అవగాహన ఉండాలి

- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- ప్రభుత్వ చెరువులు, భూముల కబ్జాలను సహించేది లేదు
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ బుర్రరేఖ అధ్యక్షతన మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి.. అభివృద్ధి పనుల్లో అధికారుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై ఎంపీడీఓ ఇచ్చిన వివరణపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని 18 గ్రామాల్లో 5,549 మందికి జాబ్ కార్డులు ఉంటే అందులో కేవలం 186 మందికి మాత్రమే పని కల్పించడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనులను గుర్తించి కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.

చెరువులు, భూములు ఆక్రమిస్తే చర్యలు

మండలం పరిధిలోని చెరువులు, కుంటలను గుర్తించి వాటికి హద్దులు ఏర్పాటు చేయాలని సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి ఆదేశించారు. వాటిని కబ్జా చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్ కోతలు లేకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ప్రభుత్వ భూములు చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయని పలువురు సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా.. వాటి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల్లో ఇంకా కేటాయించని ఇళ్లు ఉంటే వాటిని స్థానికులకే ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలంటూ సమావేశంలో సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేయాలని సూచించారు.

పార్కు స్థలాలపై నివేదిక ఇవ్వండి

బాటసింగారం, పిగ్లీపూర్ గ్రామాల్లోని పంచాయతీ లేఅవుట్లలో గల పార్కు స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ వెంకటేష్, మండల కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ గౌస్‌పాష సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే మండలంలోని అన్ని గ్రామాల్లో ఎన్ని లేఅవుట్లు ఉన్నాయి.. వాటిలో ఎన్ని పార్కు స్థలాలు పంచాయతీలకు రిజిస్ట్రేషన్ చేయించారన్న పూర్తి సమాచారంతో డీఎల్‌పీఓ, డీపీఓ ద్వారా నివేదిక అందజేయాల్సిందిగా ఎంపీఓ వినోదను ఆదేశించారు. తక్షణమే ఆయా పార్కు స్థలాల్లో ప్రభుత్వ బోర్డులను పెట్టించాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా.. ఆయా సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. మండల సమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరవ్వాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారుల వివరాలపై నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ మమతా బాయిని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ బింగిదాసు గౌడ్, వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్ దత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

నిధులను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీపీ కొప్పు సుకన్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా పంచాయతీలకు మంజూరవుతున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (బీపీడీపీ) సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ... నిధుల ఖర్చు, నిధుల జమ విషయంలో ప్రణాళికలు ఉంటేనే నిధులు దుర్వినియోగం కాకుండా ఉంటాయని అన్నారు. వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

ఎస్‌ఐలు వెంకటనారాయణ, రాజు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకటనారాయణ

యాచారం: సైబర్ క్రైమ్ నేరాలపై పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు అవగాహన, చైతన్యం కలిగి ఉండాలని యాచారం ఎస్ఐ వెంకటనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులకు మంగళవారం సైబర్ క్రైమ్ నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని అన్నారు. ఏ ఇబ్బందులున్నా యాచారం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

ఇబ్రహీంపట్నం రూరల్: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఆదిబట్ల ఎస్ఐ రాజు పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్‌లో గల ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సైబర్ మోసాల పట్ల ఆయన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎస్ఐ రాజు మాట్లాడుతూ.. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులున్నా పోలీసులను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురికావొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాస్, సైబర్ క్రైం టీం, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

ఎస్‌ఆర్‌ఈఎఫ్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మాధవి



విద్యార్థులతో డాక్టర్లు శ్రీకాంత్, మాధవి, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: విద్యార్థి జీవితం తెల్ల కాగితం వంటిదని.. మనం ఉపయోగించే విధానాన్ని బట్టి కాగితం విలువ మారుతుందని లైన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ లండన్, సగుణ రామ్మోహన్‌రావు ఎడ్యుకేషనల్ ఫౌండేషన్(ఎస్‌ఆర్‌ఈఎఫ్) ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మాధవి అన్నారు. ప్రతిభ గల నిరుపేద విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత చదువులకు సహకారం అందజేస్తామని వారు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ లండన్, ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 3 డెస్క్‌టాప్ కంప్యూటర్లను అందజేశారు. అదేవిధంగా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ సహకారంతో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో నిర్మించిన వాష్‌రూమ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మాధవి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గతంలో ఈ పాఠశాల అభివృద్ధికి పలు సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2014లో సుమారుగా రూ.50 లక్షల ఫౌండేషన్ నిధులతో నాలుగు భవనాలు నిర్మించడంతో పాటు డిజిటల్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ తదితర వాటిని ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. అనంతరం వారు ఆ భవనాలను పరిశీలించారు. భవిష్యత్‌లో పాఠశాలకు ఎలాంటి సహకారం కావాలన్నా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలితా జ్యోతయ్య, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీటీసీ హేమ, రాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ సజ్జుపాషా, కోఆప్షన్ సభ్యుడు మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం ఝాన్సి లక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు భగ్‌వాన్‌రెడ్డి, జర్మియా, విష్ణుమూర్తి, రఘుమారెడ్డి, శ్రీనివాస్, రవి, ఉమాదేవి, విజయశ్రీ, సరళ, పద్మ, శ్రీలత, సర్వేశ్వర్‌రెడ్డి, రిటైర్డ్ టీచర్ సురేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మంచాల: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల నిమిత్తం మంచాల మండలంలోని బోడకొండ, లోయపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బోడకొండ సబ్‌స్టేషన్ పరిధిలోని బోడకొండ, చీదేడ్, దాద్‌పల్లి, ఎల్లమ్మ తండా, సత్తి తండా, కొర్రం తండా.. లోయపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని లోయపల్లి, ఆంబోత్‌తండా, సలిగుట్ట తండాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే కసిరెడ్డికి సర్పంచ్ మంజుల వినతి



ఎమ్మెల్యే కసిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్ మంజుల

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం చింతలపల్లి గ్రామాభివృద్ధికి సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని చింతలపల్లి సర్పంచ్ కొప్పు మంజుల అభ్యర్థించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసిన సర్పంచ్ ఆయన్ను ఘనంగా సత్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయితీ భవన ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ఎమ్మెల్యేను కోరారు. అలాగే గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ వెంకట్రాంరెడ్డి, కొప్పు యాదయ్య తదితరులు ఉన్నారు. అలాగే పంచాయితీ నూతన భవన ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా నాగర్‌కర్నూల్ ఎంపీ రాములును సర్పంచ్ మంజుల ఆహ్వానించారు.

విద్యార్థులకు స్టీల్ ప్లేట్ల అందజేత



ప్లేట్లు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మాడ్గుల: దాతలు అందజేస్తున్న సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. మండల పరిధిలోని సుద్దపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్ జూలురి రమేష్ రూ.6వేల నిధులతో మధ్యాహ్న భోజన ప్లేట్లను, లయన్ మెంబర్ జెడ్పీ రాజశేఖర్‌రెడ్డి రూ.5వేల నిధులతో మైక్‌సెట్, వెంకటేశ్వర్ గౌడ్ రూ.4వేలతో అంగన్‌వాడీ చిన్నారులకు కుర్చీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్ సభ్యులు రాంరెడ్డి, లింగయ్య, చంద్రశేఖర్, బాలకృష్ణ, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగండి

ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు శ్రీరాములు



స్టడీ మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో ఫౌండేషన్ సభ్యులు

ఆమనగల్లు: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ఐక్యతా ఫౌండేషన్ సభ్యుడు, మాజీ సర్పంచ్ రచ్చ శ్రీరాములు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులకు దీటుగా తీర్చిదిద్దడమే ఐక్యతా ఫౌండేషన్ లక్ష్యమని ఆయన చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఆకుతోటపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సహకారంతో అందించిన 'స్కాన్ అండ్ లెర్న్' పుస్తకాలను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థుల కోసం ఐక్యతా ఫౌండేషన్ స్కాన్ అండ్ లెర్న్ డిజిటల్ కంటెంట్ పుస్తకాలను రూపొందించడం జరిగిందని చెప్పారు. పాఠ్య పుస్తకాల్లో ఉన్న పాఠాలను విభజించి ఒక్కో పాఠానికి క్యూ ఆర్ కోడ్ రూపొందించి ఆ పాఠం యొక్క సారాంశం, క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా వీడియోల రూపంలో విద్యార్థులకు అందుతుందని ఆయన వివరించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తామని శ్రీరాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తిరుపతయ్య, మల్లయ్య, మల్లేశ్‌నాయక్, తిరుపతి, కొండల్‌రెడ్డి, శివ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలతో నూతనోత్సాహం



బహుమతులు అందజేస్తున్న అతిథులు

మాడ్గుల: క్రీడా పోటీలతో విద్యార్థుల్లో నూతనోత్సాహం పెంపొందుతుందని ఇర్విన్ ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు పర్వతాలు అన్నారు. మంగళవారం ఇర్విన్‌లో నిర్వహించిన 5కే రన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ఆరోగ్యపరంగా ఫిట్‌గా ఉండేందుకు 5కే రన్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా రెడ్‌క్రాస్ జనరల్ సెక్రెటరీ రమేష్ రెడ్డి, సర్పంచ్ పుష్పలత జంగయ్య యాదవ్, ఉపాధ్యాయులు సుధారాణి, నాగమణి, వెంకటయ్య, నందన, భిక్షపతి, మొగులయ్య, నాగేష్, పోలీస్ అధికారులు,యువజన నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పించిన నాయకులు

కడ్తాల్: స్వతంత్ర పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కూడలిలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోరాట పటిమను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు చంద్రయ్య, వెంకటేశ్‌జీ, లక్ష్మీనారాయణ, మహేశ్, దేవి, మురళి, చందు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య బృందంతో నిర్వాహకులు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని సంఘం సంచాలకుడు డా.బాచిరెడ్డి శాయి రెడ్డి తెలిపారు. కామినేని హాస్పిటల్స్ వారు ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి, జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పట్టాభి రామారావు ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.వైద్య సిబ్బంది పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులుకు పరీక్షలు చేసి వారికి పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి మానిక్ ప్రభు, సంచాలకుడు కాటంగురి బుచ్చి బాబు, శ్రీనాథ్, డాక్టర్ బాచిరెడ్డి శాయి రెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యుడు మొలుగూరి ఫణీంద్ర భార్గవ్, పీపీ సునీత బర్ల, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి పాల్గొన్నారు. ఈ శిబిరంలో మొత్తం 600 మందికి బీపీ, మధుమేహం, ఈసీజీ, ఆర్థోపెడిక్ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

బాల్య వివాహాలు అరికట్టేందుకు కృషి

నాగుల్‌దోని తండాల్లో నేషనల్ గర్ల్ చైల్డ్ డే



కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, అంగన్‌వాడీ సిబ్బంది

మహేశ్వరం: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతానాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగుల్‌దోని తండాలో ఐసీడీఎస్ మహేశ్వరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో నేషనల్ గర్ల్ చైల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లలను చదివించి ప్రయోజకులను చేయాలని కోరారు. ఆడ పిల్లలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ముందుగా ఆడ పిల్లల చదువు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, తల్లులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అందిస్తున్న పౌష్టికాహారం, పాలు, గుడ్లు, బాలమృతం గురించి అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ షభానా, సర్పంచ్ రాజునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు అంధ్యానాయక్, సూపర్‌వైజర్లు విద్యావతి, శిరీష, దివ్య,అనిత పాల్గొన్నారు.

దాతల సహకారంతో బోరు డ్రిల్లింగ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ దేవాలయం వద్ద దాతల సహకారంతో మంగళవారం బోరు డ్రిల్లింగ్ పనులు చేపట్టారు. మేడిగడ్డ తండాకు చెందిన సోమ్లు, రాజ్‌కుమార్, రమేశ్ బోరు డ్రిల్లింగ్ పనులకు విరాళం అందజేశారు. బోరులో పెద్ద ఎత్తున నీరు రావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేశారు. మేడిగడ్డ తండావాసులు రవీందర్‌నాయక్, దశరథ్‌నాయక్, హేమానాయక్, రాములు, పురుషోత్తం, శంకర్, లక్ష్మణ్, సురేశ్, జయరాం, నందు, రఘు, మహిపాల్ పాల్గొన్నారు.

అజయ్‌పై చర్యలు తీసుకోండి

మాదిగ సంఘాల ఐక్యవేదిక

తలకొండపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్.అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీని తీవ్ర పదజాలంతో దూషించి అవమానించిన నల్లగొండ జిల్లా గట్టుప్పల మండలం తేరెటిపల్లికి చెందిన అజయ్‌పై చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో అజయ్‌పై మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బాలు, బలరాం, విటాపల్లి రమేష్, మీసాల రమేష్, శెట్టిపల్లి రామకృష్ణ, భాస్కర్, మల్లేష్, బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ జాబితాలో చేర్చండి

ఇబ్రహీంపట్నం: కేంద్ర ఓబీసీ జాబితాలో వీరశైవ లింగబలిజ లింగాయత్‌లను చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి శివకుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఇబ్రహీంపట్నంలో మాట్లాడుతూ.. ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడిన లింగబలిజలను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లోపు నిర్ణయం తీసుకోవాలని కోరారు.

రేపు ఆమనగల్లులో ట్రాక్టర్ల ర్యాలీ

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గురువారం ఆమనగల్లు పట్టణంలో ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీకి రైతులు, కూలీలు, కార్మికులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటయ్య, పెంటయ్య తదితరులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ ఎం.ఎస్.జాయింట్ హొరిజోన్ LLP, ప్రాతినిధ్యం వహించినవారు నియమించబడిన భాగస్వామి శ్రేయస్ భటేవరా రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, అమీర్‌పేట్ గ్రామం వద్ద గల ఎ.0-15 గుంటల విస్తీర్ణంతో సర్వే నం. 106 కలిగి ఉత్తరం: అమీర్‌పేట్ నుండి మహేశ్వరం వరకు మెయిన్ రోడ్, దక్షిణం: ప్రసాద్‌రాజు మరియు ఇతరులకు చెందిన భూమి, తూర్పు: ప్రసాద్‌రాజు మరియు ఇతరులకు చెందిన భూమి, పశ్చిమం: యజమానుల మిగతా భూమి హద్దులుగా గల ప్లాట్‌ను కొనుగోలు చేయుటకు 20-11-2023 తేదీ గల అమ్మకం ఒప్పందం కుదుర్చుకుని శ్రీమతి తుమ్మల శారదా దేవి భర్త తుమ్మల చంద్రశేఖర్‌కు పాక్షిక అమ్మకం మొత్తాలను చెల్లించారని సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేస్తున్నారు.

ఎవరేని వ్యక్తి/లు లేదా ఏదేని ఆర్థిక సంస్థ/లు, బ్యాంకులు, సంస్థ లేదా కంపెనీ/లు పైన తెలిపిన సదరు ఆస్తికి సంబంధించి పాక్షికంగా లేదా పూర్తిగా ప్రతిపాదిత అమ్మకం లావాదేవీకి ఏదేని హక్కు, టైటిల్, క్లెయిమ్, లీన్, ప్రయోజనం/లు లేదా అభ్యంతరాలు కలిగి ఉన్నట్లయితే, అట్టి వారి క్లెయిమ్‌కు మద్దతుగా డాక్యుమెంట్లతో సహా తమ వ్రాతపూర్వక అభ్యంతరాలను దిగువ సంతకందారుకు ఈ నోటీసు ప్రచురణ తేదీ నుండి 10 రోజుల లోగా పంపవలెను.

ఒకవేళ అభ్యంతరాలు అందనట్లయితే, నా క్లయింట్ మిగిలిన అమ్మకం ప్రతిఫలాన్ని చెల్లించి అమ్మకం లావాదేవీని పూర్తిచేయుటకు ముందుకు కొనసాగుతారు మరియు సదరు ఆస్తి యొక్క నమోదిత సేల్ డీడ్ మరియు స్వాధీనతను పొందుతారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే, ఆ తరువాత అవి అంగీకరించబడవు మరియు చెల్లనివిగా, కొట్టివేయబడినవిగా పరిగణించబడును.

సం/- కె.ధరమ్ సింగ్, అడ్వకేట్
బి1, బి బ్లాక్, దుర్గా ఎంక్లేవ్, ఆర్.కె.నగర్
అత్తాపూర్, హైదరాబాద్ - 500048
మొబైల్: 9030581001
ఇ-మెయిల్: priveattorney@gmail.com

సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

బి. కిరణ్‌కుమార్
9912220386